

కాలుష్య రహిత దీపావళి మనందరి బాధ్యత : కలెక్టర్

ప్రజాశక్తి - కడప: భవిష్యత్తరాలకు ఆరోగ్యకరమైన జీవితాన్ని, కాలుష్య రహిత ప్రకృతిని అందించాలంటే దీపావళి రోజున కొన్ని జాగ్రత్తలు, నియంత్రణలు తప్పనిసరిగా పాటించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీపావళి సందర్భంగా టపాకాయలు కాల్చడం వల్ల వాయు కాలుష్యం స్థాయి పెరుగుతోందన్న విషయాన్నీ ప్రతి ఒక్కరూ ఆలోచించి మనందరి బాధ్యతగా విధిగా కొన్ని విధానాలను అనుసరించాలని కోరారు. ఇంటింటా దీపాలు.. రంగుల వెలుగుల దీపపు కాంతులు శుభాలకు ప్రతిరూపాలుగా కనువిందు చేసే దీపావళి పండుగ ఎన్ని కష్టాలు ఎదురైనా నిరాశ చెందకుండా ఎదురునిలిచి పోరాడి విజయం వైపు నడవాలనే సందేశాన్ని సమాజానికి అందిస్తుంది. ఈ పండుగ రోజు పిల్లలు పెద్దల సమక్షంలో, యువత దుడుకుపాటు లేకుండా ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా ఈ దీపావళి పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

రాజ్యాంగ మూల స్తంభాలపై దాడి హేయం

- హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్

ప్రజాశక్తి-కడప అర్బన్

బిఆర్ గవాయిపై దాడి రాజ్యాంగ మూల స్తంభాలపై జరిగిన దాడిగా చూడాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్ తెలిపారు. ఆదివారం కడప నగరంలోని ఓల్డ్ రిమ్స్‌లోని బిసి భవన్‌లో జిల్లా పౌర సమాజం ఆధ్వర్యంలో భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై దాడికి వ్యతిరేకంగా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ మాట్లాడారు జస్టిస్ బి.ఆర్.గవాయిపై దాడి కేవలం ఒక వ్యక్తిపై జరిగిన శారీరక దాడి కాదు ఇది భారత రాజ్యాంగం మూల స్తంభాలపై, ముఖ్యంగా డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం అనే ఆదర్శాలపై భావజాల దాడి అన్నారు. ఈ సంఘటన రాజ్యాంగపరమైన అత్యున్నత స్థానంలో ఉన్న వ్యక్తిపై జరిగినప్పటికీ, మన సమాజంలో కులతత్వం ఎంత లోతుగా పాతుకుపోయిందో, అది ఎంత సున్నితమైనదో, ఎంత ప్రమాదకరమైనదో సంఘటన స్పష్టంగా తెలియజేస్తుందన్నారు. సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించమని దాడి చేస్తూ హెచ్చరిక ఇవ్వడం దేనికి సంకేతమో ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు.సాక్షాత్తు భారత ప్రధానమంత్రి భారత్ వికసిత్ సభలో మాట్లాడుతూ దేశం వికసించాలంటే రాజ్యాంగం ఏకైక అడ్డంకి అని చెప్పడం ఆంతర్యం ఏమిటో ప్రజలందరూ అర్థం చేసుకుంటే గవాయిపై జరిగిన దాడి అర్థమవుతుందన్నారు. బిజెపి చేస్తున్న కుట్రలను ప్రజలందరూ అర్థం చేసుకుని రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎంతోమంది ఆర్థిక నేరస్థులు ఉన్నారని వీరందరూ స్విస్ బ్యాంకులో నల్లధనాన్ని పోగు చేసుకున్నారని, ఎన్నికలకు ముందు మాట్లాడిన మోడీ ఒక రూపాయి కూడా నల్లధనాన్ని వెనక్కి తీసుకురాలేదన్నారు. నాడు మోడీ చెప్పిన నల్లధనం రూ.60 లక్షల కోట్లు అయితే ఈరోజు అది రూ.90 లక్షల కోట్ల ఉందన్నారు. మరి ఈ డబ్బును ఎప్పుడు వెనక్కి తెస్తారు, ప్రతి కుటుంబానికి రూ.10 లక్షల ఇస్తానని చెప్పిన మాటను ఎప్పుడు నెరవేరుస్తారని ప్రశ్నించారు.ఆర్ఎస్ఎస్ బిజెపిలు ఏ ఒక్క రోజైనా రైతులకు గిట్టుబాటు ధర గురించి మాట్లాడారా, స్వాతంత్రానికి ముందు, స్వాతంత్రం తర్వాత ఒక ఉద్యమమైన చేశారా, అసలు భారత జాతీయ జెండాను 2022 వరకు గౌరవించని ఏకైక ఒక సమస్త ఉంది అంటే అది బిజెపి, ఆర్ఎస్ఎస్ అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత దుర్మార్గంగా వ్యవహరించే టువంటి వీరికి భారత ప్రజలు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. లాయర్ సంపత్ కుమార్ మాట్లాడుతూ మనిషిని మనిషిగా చూడని భారతదేశంలో ఏదైనా పార్టీ ఉందా అంటే అది బిజెపి, ఆర్ఎస్ఎస్‌లే అని మండిపడ్డారు. ఆర్ఎస్ఎస్ బిజెపిలు భారత్ వికసిత్ కోసం పనిచేయడం లేదు కేవలం అదానీ, అంబానీలను వికసింప చేయడానికి కోసం మాత్రమే పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. భారత దేశ ప్రజల శ్రమను ఆర్థిక దోపిడీని చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బిఆర్ గవాయిపై జరిగిన దాడి భారతదేశంలో ప్రత్యామ్నాయ భావజాలంపై జరిగిన దాడిగా కనిపిస్తుంది అన్నారు. డాక్టర్ రాజా వెంగల్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ బిజెపిలుమతోన్మాదాన్ని పెంచి పోషించడంతోపాటు దేశాన్ని సర్వనాశనం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశాన్ని కాషాయ రంగుగా మార్చాలని కంకణం గట్టుకొని బిజెపి ఆర్ఎస్ఎస్‌లో పనిచేస్తున్నాయన్నారు. దేశంలో అడుగడుగునా మనువాద దుర్మార్గాలను వికసింప చేయడం కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దేశం అభివృద్ధి చెందడం అంటే గుజరాతీలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా మోడీ అమిత్యాలు వ్యవహరిస్తున్నారన్నారు. లెనిన్ ప్రసాద్ మాట్లాడుతూ బిఆర్ గవాయిపై జరిగిన దాడి దేనికి ప్రతిఘటనగా కనిపిస్తుందో ప్రజలందరూ అర్థం చేసుకోవాలని తెలిపారు ఒక దళిత వ్యక్తి దేశ అత్యున్నత న్యాయమూర్తి కావడం అనేది రిజర్వేషన్ల ద్వారా సాధ్యమైన సామాజిక చలనం సంకేతం అన్నారు. సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ భారతదేశం హిందువుల దేశంగా బిజెపి, ఆర్ఎస్ఎస్‌లో భావిస్తూ మతోన్మాదాలను ప్రేరేపిస్తున్నాయన్నారు. భారత రాజ్యాంగంలో బహుళత్వాన్ని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య సమానత్వాన్ని పెంపొందించే దిశగా ప్రజలందరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం నగర్ కార్యదర్శిలు వెంకట శివ, రామ్మోహన్, ఎల్ఐసి నాయకులు రఘునాథరెడ్డి, సాహితీ స్రవంతి రాష్ట్ర ఉపాధ్యక్షులు పిల్లా కుమారస్వామి, ఎన్జీవో నాయకులు రాజశేఖర్, శ్రీనివాసులు, గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నాయకులు కె.వి.రమణ,, మర్రిపాటి నాగరాజు, జన విజ్ఞాన వేదిక నాయకులు విశ్వనాథ్, యుటిఎఫ్ నాయకులు లక్ష్మీరాజ, ఎస్‌టియు నాయకులు సురేష్, రాయలసీమ ఎస్‌సి, ఎస్‌టి ఫోరం వెల్ఫేర్ అధ్యక్షులు, జెవి మహాజన రాజ్యం పార్టీ నాయకులు సంగటి మనోహర్, బిఎస్పి నాయకులు సగిలి గుర్రప్ప, బిఆర్ సోమన్న, ఐలు నాయకులు సుబ్రహ్మణ్యం, ఐఎల్ఎ నాయకులు గంగులయ్యరైతు సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కామనూరు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి మనోహర్, వివిధ ప్రజా సంఘాల నాయకులు, రాజకీయ పార్టీ నాయకులు, వామపక్ష ప్రజాతంత్ర శక్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హైకోర్టు మాజీ న్యాయమూర్తి చంద్రకుమార్

భద్రతా ప్రమాణాలకు పెద్దపీట

- డిప్యూటీ ఛీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ఆఫీసర్ పి.చిన్నారావు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

పరిశ్రమల యాజమాన్యాలు భద్రతా ప్రమాణాలకు పెద్దపీట వేయాలి. కార్మికుల ప్రాణాలకు ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అనంతరం పారిశ్రామిక ఉత్పత్తిని చేపట్టాలి. పనిప్రదేశాల్లో హానికరమైన పదార్థాలను, పరికరాలను తొలగించాలి. అనంతరం ఉపాధి పనులు కల్పించాలి. సేఫ్టీ సంస్కృతిని మెరుగు పరచాలి. ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానంలో పరిశ్రమల తనిఖీ, దర ఖాస్తుల పరిశీలన శీఘ్రగతిన చేపడుతున్నాం. ప్రతిఏటా డిసెంబర్‌లో ఫ్యాక్టరీ లైసెన్స్ రెన్యువల్ ఫీజును ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొంటున్న డిస్ట్రిక్ట్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ పి.చిన్నారావుతో ముఖాముఖి..

పరిశ్రమల వివరాలపై తెలపండి?

కడప జిల్లాలో 70, అన్నమయ్య జిల్లాలో 30 పరిశ్రమలు చురుకుగా పని చేస్తున్నాయి. కడప జిల్లాలో ఐదు భారీ సిమెంట్ పరిశ్రమలు, కొప్పర్తిలో 10 పరిశ్రమలు, పులివెందుల్లో గార్మెంట్ పరిశ్రమ ఉన్నాయి. వీటిలో 2,500 మంది కార్మికులు, హెచ్‌పిసిఎల్, ఐఒసిఎల్ పరిశ్రమల్లో 3 వేల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

పరిశ్రమల తనిఖీలపై మాట్లాడండి?

ఫ్యాక్టరీస్ ఆఫ్ రాష్ట్ర కమిషనరేట్ నుంచి వచ్చే సెంట్రల్ సిస్టమ్ ఇన్‌స్పెక్షన్ జాబితా ఆధారంగా తనిఖీలు చేపడతాం. తనిఖీల వివరాలను కమిషనరేట్‌పై ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తాం. ఆర్నెళ్లు చిత్తూరు, తిరుపతి జిల్లాలు, మరో ఆర్నెళ్లు కడప, అన్నమయ్య జిల్లాల్లో తనిఖీలు చేపడతాం.

స్పెషల్‌డ్రైవ్స్ ఏమైనా ఉంటాయా?

జిల్లాలోని పరిశ్రమల తనిఖీల్లో భాగంగా పరిశ్రమల యాజమాన్యాలకు, నిపుణులకు, కార్మికుల రక్షణ కోసం స్పెషల్‌డ్రైవ్స్ ఏర్పాటు చేస్తాం. వీటికి అదనంగా సేఫ్టీ కమిటీ మీటింగ్ నిర్వహిస్తాం. ఆర్నెళ్లకోసారి ఎమర్జెన్సీ మాక్‌డ్రిల్ నిర్వహిస్తాం. ఫలితంగా జిల్లాలోని 28 ప్రమాదకర పరిశ్రమల్లో రక్షణ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించడం జరుగుతుంది.



ముఖాముఖి..

ప్రమాద బాధితుల పరిహారంపై మాట్లాడండి?

ఐదేళ్లలో చోటుచేసుకున్న ప్రమాదాల్లో ఐదుగురు ప్రమాదాల బారిన పడి మృతి చెందారు. ఇఎస్ఐ ఉన్న కార్మికులకు పెన్షన్‌తోపాటు పరిహారం అందించడం జరుగుతుంది. ఇఎస్ఐ లేనివారికి వర్క్‌మెన్ కాంపెన్సేషన్ యాక్ట్ ప్రకారం పరిహారం అందు తుంది.

పరిశ్రమల రెన్యువల్ ఫీజు లక్ష్యమెంత?

ఉభయ జిల్లాలో రూ.41,78,250 రెన్యువల్ ఫీజు చెల్లించాల్సి ఉంది. ఆచరణలో రూ.16,90,900 మాత్రమే వసూలు కావడం గమనార్హం. ప్రతి ఏటా డిసెంబర్ మాసంలో పరిశ్రమల రెన్యువల్ ఫీజులు చెల్లించాలని కోరుతున్న ఆశించిన స్పందన కనిపించడం లేదు.

ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానం గురించి తెలపండి?

ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానం అంటే పరిశ్రమల తనిఖీలను సరళతరం, పారిశ్రామిక తనిఖీల్లో అధికారులు గుర్తించిన లోపాలను తెలియజేసి వాటిని సరిచేసుకోవడానికి అవకాశం ఇవ్వడం. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి వేగంగా అనుమతులు మంజూరు చేయడమే.

'బుడ్డా' దాతృత్వం స్ఫూర్తిదాయకం : 'ఆకేపాటి'

ప్రజాశక్తి-కడప అర్బన్

మహాదాత బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం అందరికీ స్ఫూర్తిదాయకమని రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి అన్నారు. ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కుమ్మరి దస్తగిరి రచించిన బుడ్డా వెంగళరెడ్డి జీవిత చరిత్ర పుస్తక పరిచయ కార్యక్రమం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో ఆదివారం కడప హౌసింగ్‌బోర్డు కాలనీలోని శ్రీకోదండ రామాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆకేపాటి మాట్లాడుతూ డొక్కల కరువులో తిండి లేక వేలాది మంది రాయలసీమ ప్రజలు మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. అలాంటి సమయంలో బుడ్డా వెంగళరెడ్డి కొన్ని వేల మందికి కొన్ని నెలల పాటు అంబలి పోసి ప్రాణాలు కాపాడారన్నారు. ఆయన దాతృత్వం, సేవల గురించి భావితరాలకు తెలియజేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కడపలో ఆయన విగ్రహ ఏర్పాటుకు అందరూ ముందుకు రావాలని, తనవంతు సహకారం అందిస్తానని హామి ఇచ్చారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎం.వి.రామచంద్రారెడ్డి మాట్లాడుతూ బుడ్డా వెంగళరెడ్డి దాతృత్వం, ఆయన చరిత్ర గురించి పాఠ్యాంశాల్లో చేర్చాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రభుత్వ పథకాలకు ఆయన పేరు పెట్టాలన్నారు. ఇందువల్ల భావి తరాలు ఆయన గురించి తెలుసుకుని స్ఫూర్తి పొందేందుకు వీలుంటుందన్నారు. ఈ విషయాన్ని తాను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని తెలిపారు. రాయలసీమ కార్మిక కర్షక సమితి అధ్యక్షులు సిహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ రాయలసీమకు చెందిన బుడ్డా వెంగళరెడ్డి, ఉయ్యాలవాడ నరసింహారెడ్డిలతోపాటు ఎందరో మహనీయుల సేవలు, త్యాగాలను వెలుగులోకి తీసుకు వచ్చేందుకు విశ్వవిద్యాలయాలు పరిశోధనలు చేపట్టాలని పేర్కొన్నారు. భయంకరమైన కరువు పరిస్థితుల్లో వెంగళరెడ్డి వేలాది మంది కరువు బాధితులను అక్కున చేర్చుకుని అంబలి పోసి ప్రాణాలు నిలుపడం సామాన్యమైన విషయం కాదన్నారు. ఆయన జీవితం, సేవల గురించి ప్రభుత్వం కూడా విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నందన, డొక్కల, ధాతు వంటి భయానక కరువుల్లో రాయలసీమ ప్రజలు అనుభవించిన ఆవేదన, కన్నీళ్లు, అవమానాలు లాంటి అంశాల గురించి బ్రిటీషు గెజిటీర్లు, చరిత్ర పుస్తకాల్లో లేవన్నారు. ఆ విషయాలను చరిత్ర పరిశోధకులు వెలుగులోకి తీసుకు రాగలిగితే రాయలసీమ యువత ఈ ప్రాంత అభివృద్ధి కోసం పెద్ద ఎత్తున ముందుకు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం పుస్తక రచయిత దస్తగిరి, బుడ్డా వెంగళరెడ్డి ఐదవ తరం వారసులు బుడ్డా విష్ణువర్ధన్‌రెడ్డి, ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన కవి కర్నాటి రామకృష్ణారెడ్డి, పుస్తక సమీక్షకులు సాయిప్రసాద్, రెడ్డి సేవా సమితి జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రారెడ్డి, యూట్యూబర్ ప్రసాద్‌లను నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీ కోదండ రామాలయ ధర్మకర్త వెంకటరెడ్డి, కడప నగర డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, ఇంటాక్ జాతీయ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, నగర ప్రముఖులు పోతుల వెంకట్రామిరెడ్డి, వైసిపి రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, మానవత సంస్థ ప్రతినిధులు డాక్టర్ రామాంజులరెడ్డి, ఆచార్య సాంబశివారెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డి



సర్టిఫికెట్ అందజేస్తున్న కళాశాల ఎమ్‌డి చంద్ర ఓబుల్‌రెడ్డి

ముగిసిన మేనేజ్‌మెంట్ విద్యార్థుల మేళా

ప్రజాశక్తి-కడప అర్బన్

కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి మేనేజ్‌మెంట్ విద్యార్థుల మేళా మీట్ విజయవంతంగా ముగిసింది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వివిధ ఎంబిఎ కళాశాలల నుంచి 104 మంది విద్యార్థులు హాజరయ్యారు. యంగ్ మేనేజర్, హెచ్‌ఆర్ గేమ్స్, మార్కెటింగ్ ఈవెంట్స్, ఫైనాన్స్ పోటీలు, వంటి విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కెఎస్ఆర్ఎం కళాశాల ఎమ్‌డి డాక్టర్ కందుల చంద్రఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ ఎక్సెల్సియర్ ఎల్లపుడూ ఉన్నతమైన స్థానం అనే భావం, విద్యార్థులందరూ సొసైటీని మరింత ఎక్సెల్సియో చేయాలని ఆకాంక్షించారు. ఎంబిఎ విద్యార్థులు వారి సమయస్ఫూర్తితో, మేదస్సు వల్ల ఈ సొసైటీ మరింత ఎక్సెల్షియర్ చేయాలని కోరారు. విద్యార్థుల ప్రతిభను ప్రశంసిస్తూ భవిష్యత్తులో ఇలాంటి కార్యక్రమాల ద్వారా మేనేజ్‌మెంట్ విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు, వ్యాపార దృక్పథం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కె ఎస్ ఆర్ ఎం కరస్పాండెంట్ అండ్ ట్రెజరీ కందుల రాజేశ్వరి, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ నాగేశ్వర ప్రసాద్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ ఎన్.సుహాసిని, ఎక్సెల్సియర్ కన్వీనర్ డాక్టర్ నాగమణి, అధ్యాపకులు పాల్గొన్నారు.

అవార్డు అందుకోవడం అభినందనీయం

ప్రజాశక్తి-కడప అర్బన్ : జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికా ర్జునరెడ్డి 'సాహిత్య కళానిధి 'అవార్డు అందుకోవడం అభినందనీయమని రచయి తల సంఘం గౌరవాధ్యక్షులు, ప్రముఖ కథా రచయిత షేక్ హుస్సేన్ అన్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ వారు హైదరాబాద్ రవీంద్ర భారతిలో ఆదివారం ఆ సంస్థ అధ్యక్షులు 'కళా రత్న' బిక్కికృష్ణ, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎం.నరసింహప్ప, రాజమహేంద్రవరం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం విసి ఆచార్య డి.మునిరత్నం నాయుడు, రాజధాని ఫైల్స్ చిత్ర నిర్మాత కంఠమనేని రవి శంకర్, ప్రముఖ గజల్ కవయిత్రి డాక్టర్ పి.విజయలక్ష్మి పండిట్, డాక్టర్ శర్మ, భాషా పరిశోధకులు వాసిరెడ్డి మల్లీశ్వరి చేతుల మీదుగా మల్లికార్జునరెడ్డికి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం గౌరవాధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, అలపర్తి పిచ్చయ్య చౌదరి, సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి, మాచిరెడ్డి సంజీవమ్మ, షేక్ సత్తార్ ఫైజి, ఉపాధ్యక్షులు డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ చింతకుంట శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, కార్యదర్శి డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, సంయుక్త కార్యదర్శులు డాక్టర్ పొదిలి నాగరాజు,భూమిరెడ్డి స్వరూపారాణి, కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు డాక్టర్ సాయి ప్రసాద్,డాక్టర్ అనుగూరు చంద్రశేఖర రెడ్డి, డాక్టర్ పెద్దిరెడ్డి నీలవేణి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, డాక్టర్ తవ్వా వెంకటయ్య, డాక్టర్ తుమ్మలూరు సురేష్ బాబు, డాక్టర్ రాజగోపాల్ రెడ్డి, డాక్టర్ కోడూరు స్వతంత్ర బాబు మల్లికార్జున రెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. పురస్కార గ్రహీత ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి స్పందిస్తూ భారతీయ సాహిత్య అనువాద ఫౌండేషన్ వారు తనకు ఈ పురస్కారాన్ని అందజేయడం ఆనందదాయకమని పేర్కొన్నారు. సంస్థ వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ సాహిత్య కళా రంగాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానన్నారు.



పురస్కారం అందుకుంటున్న మూల మల్లికార్జునరెడ్డి

క్షత్రియుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : 'చమర్తి'

ప్రజాశక్తి - రాజంపేట: క్షత్రియుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, త్వరలో క్షత్రియుల ఆత్మీయ సమ్మేళనానికి ఆతిధ్యం ఇస్తామని టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. ఆదివారం శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్‌లో జరిగిన క్షత్రియ ఫెడరేషన్ ఆంధ్రప్రదేశ్ వార్షికోత్సవ సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయనను క్షత్రియ ఫెడరేషన్ సభ్యులు శాలువా కప్పి జ్ఞాపిక అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజంపేటలో జరిగే ప్రతి క్షత్రియ సమావేశాన్ని శాన్వి ఇంటర్నేషనల్ స్కూల్ చైర్మన్ శరత్ కుమార్‌రాజు ముందుండి కార్యక్రమాలు చేయడం చాలా అభినందనీయమన్నారు. రాష్ట్ర స్థాయిలో క్షత్రియుల ఎదుగుదలకు రాజకీయాల్లో, ఆర్థికంగా బలపడుతూ ఒకరికి ఒకరు సహకరించుకుంటూ కలిసికట్టుగా నిలబడి రాష్ట్ర స్థాయిలో హక్కులను సాధించుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం కార్తీక మాసంలో కోస్తా జిల్లాల్లో క్షత్రియ సోదరులు ప్రతి ఏటా కార్తీక వనభోజనాన్ని ఏర్పాటు చేసుకుంటారని వివరించారు. రాయలసీమ జిల్లాల్లో ఈ సంవత్సరం రాజంపేట నియోజకవర్గం, నందలూరు చెయ్యేరు నది పక్కన వెలసిన శివాలయం దగ్గర ఈ సంవత్సరం కార్తీక మాసంలో క్షత్రియ వనభో జనం ఘనంగా నిర్వహించాలని అనుకుంటున్నామన్నారు. కార్యక్ర మంలో ఆంధ్రప్రదేశ్ క్షత్రియ ఫెడరేషన్ చైర్మన్ సి.హెచ్.వెంకటపతి రాజు, ప్రధాన కార్యదర్శి డి.ఎస్.ఎన్.రాజు, అడ్వైజరి బోర్డు మెంబర్ జగన్నాథరాజు, రామకృష్ణంరాజు, నిషిత రాజు, ఫెడరేషన్ వైస్ చైర్మన్ శరత్ రాజు, రాయలసీమ క్షత్రియ వికాస్ ఫెడరేషన్ అధ్యక్షులు సుబ్రహ్మణ్యం రాజు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వర్షిత

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి విద్యన భ్యసి స్తున్న ఎం. వర్షిత రాష్ట్రస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికైంది. జిల్లా స్పోర్ట్స్ అథారిటీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కడప వారి ఆధ్వర్యంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో పాల్గొని గోల్డ్ మెడల్ సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ నీలకంఠరావు తెలిపారు.నవంబర్‌లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వర్షిత పాల్గొంటుందని పేర్కొన్నారు. వర్షిత రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక ఇవ్వడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ లీలా శ్రీహరి ప్రత్యేకంగా అభినం దించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో కూడా అద్భుతంగా రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాల ని ఆకాంక్షించారు. విద్యార్థులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు.




గోల్డ్ మెడల్ సాధించిన వర్షిత

మొహమ్మద్ ఆజంఖాన్‌ను కలిసిన సలావుద్దీన్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఆంధ్రప్రదేశ్ ముస్లిం సమైక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు సలావుద్దీన్ ఉత్తర్ ప్రదేశ్ సీనియర్ సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు మొహమ్మద్ ఆజంఖాన్‌ని రాంపూర్‌లోని ఆయన నివాసంలో ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మైనారిటీ హక్కుల, సమాజ అభివృద్ధి, విద్య, రాజకీయ ప్రతినిధ్యం వంటి అంశాలపై చర్చించారు. ఆజంఖాన్ ఎంపీ, ఎమ్మెల్యే, యుపిలో అర్బన్ డెవలప్‌మెంట్, మైనార్టీ వెల్ఫేర్, వక్ఫ్ మంత్రిగా సేవలు సేవలందించారు. మౌలానా మొహమ్మద్ అలీ జవహర్ యూనివర్సిటీ స్థాపన ద్వారా మైనార్టీ విద్యాభివృద్ధికి, మౌలిక సదుపాయాలకు కీలకమైన కృషి చేశారు. సలావుద్దీన్ ఆజంఖాన్ విద్యా, సంక్షేమ కార్యక్రమాలను ప్రశంసించారు. ఎపిలో కూడా ఇలాంటి కార్యక్రమాలను అమలు చేయడం అవసరమని పేర్కొన్నారు. విద్య, నైపుణ్య శిక్షణ, రాజకీయ ప్రాతినిధ్యం కోసం సమగ్ర వ్యూహాలపై చర్చించినట్లు తెలిపారు. మైనార్టీల హక్కులు, శక్తిని పెంపొందించడం అత్యవసరయని సలావుద్దీన్ వివరించారు.



ఆజంఖాన్‌ను సన్మానిస్తున్న సలావుద్దీన్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

సిఎం స్పందన హర్షణీయం

- ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు

ప్రజాశక్తి-కడప అర్బన్

దీపావళి కానుకగా నవంబర్ నుంచి ఒక డిఎను విడుదల చేసి డిమాండ్స్ పరిష్కరిస్తాన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించడం పట్ల ఎపి ఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. డిమాండ్స్ ప్రభుత్వం నుంచి సాధించిన రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ఎన్‌జిఒ హోంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్, జిల్లా కార్యదర్శి పి.నిత్య పూజయ్య మాట్లాడుతూ సిఎం 60 రోజుల్లో హెల్త్ కార్డుల వ్యవస్థను సక్రమం గా నడిపించేందుకు కమిటీని ఏర్పాటు చేసి ఇన్సూరెన్స్ విధానాన్ని పరిశీలించాలని ఆదేశాలు జారీ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఆర్‌టీసీ ఉద్యోగుల ప్రమో షన్‌లపై వారం రోజుల్లో ఉత్తర్వులు జారీ చేస్తామని ప్రకటించడం అభినందనీ యమన్నారు. దీపావళి పండుగకు ముందే ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించడం, సిఎంతో, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్‌తో జరిగిన స్నేహపూర్వకమైన, గౌరవప్రదమైన, హుందాతన చర్చలు దాదాపు ఐదు సంవత్సరాల తర్వాత ఈ స్థాయిలో సాగడం సంతోషదాయకమని పేర్కొన్నారు. దీపావళికి ముందే ఉద్యోగ సంఘాల డిమాండ్లపై ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేయాలని పట్టుబట్టి, ఆ సమావేశాన్ని సాధించగలిగిన ఎపి జెఎసి అధ్యక్షులు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డి.వి.రమణకు ఉద్యోగ సంఘాల తరపున అభినందనలు తెలిపారు. సమావేశంలో నాయకులు తిమ్మారెడ్డి, పద్మనాభరావు, వీరరెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు బూటకమేనా? : మాజీ ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కడప అర్బన్

కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు అధికారంలోకి రాగానే ఐఆర్ ప్రకటిస్తామని, మెరుగైన పిఆర్‌సి అమలు చేస్తామని, సిపిఎస్, జిపిఎస్ విధానాన్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారాన్ని కృషి చేస్తామని, ప్రతి సభలో ఉదరకొట్టి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు ఇచ్చిన హామీలతో పాటు ఉద్యోగులని మరిచిపోయి ఎన్నికల హామీలన్నీ బూటక హామీలుగా మిగిలిపోయాయని మాజీ ఎమ్మెల్సీ పి.సుబ్బారెడ్డి విమర్శించారు. ఆదివారం పిఎస్‌టియు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 12వ పిఆర్‌సి, 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, లేకపోతే ఉద్యోగుల దెబ్బ కూటమి ప్రభుత్వం చవి చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. పిఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఉద్యోగ సంఘాలతో జరిపిన సమావేశంలో రూ.31 వేల కోట్ల బకాయిల ఊసే లేదని, 28 నెలల కాలంగా పిఆర్‌సి కమిషన్ నియమించకపోవడం అనేది రాష్ట్ర చరిత్రలో మొదటిసారన్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చకపోతే జెఎసిలతో కలిసి ఉద్యమిస్తామని హెచ్చరించారు.

అమరవీరుల కుటుంబాలకు అండగా ఉంటాం : ఎఎస్‌పి

ప్రజాశక్తి-కడప అర్బన్

విధినిర్వహణలో, అసాంఘిక శక్తుల చేతిలో మృతి చెందిన పోలీసు సిబ్బంది సంక్షేమ కోసం జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడు కృషి చేస్తుందని అదనపు ఎస్‌పి (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు అన్నారు. అక్టోబర్ 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నేపథ్యంలో ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు విధినిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబ సభ్యులతో జిల్లా పోలీసు కార్యాలయంలోని మినీ పోలీసు కాన్ఫరెన్సు హాలులో అదనపు ఎస్‌పి కె.ప్రకాష్ బాబు ఆదివారం సమావేశమయ్యారు. ప్రభుత్వం పరంగా అందాల్సిన సౌకర్యాలు (బెనిఫిట్స్), కుటుంబ స్థితి గతులు, బాగోగుల గురించి అడిగి తెలుసుకున్నారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతి చెందిన పోలీసు కుటుంబాల సమస్యలను తెలుసుకోవడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కుటుంబ యోగక్షేమాలు అడిగి అమరవీరుల పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. సిబ్బంది సంక్షేమం కోసం అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. పోలీసు శాఖ ఎల్లప్పుడై సహాయ, సహకారం అందిస్తుందన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి తనకు విన్నవించవచ్చుని, పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఎఆర్ అదనపు ఎస్‌పి బి.రమణయ్య, ఎఆర్ డిఎస్‌పి నాగేశ్వర రావు, డిపిఒ ఎఒ వెంకట రమణ, సూపరింటెండెంట్ సురేష్, ఆర్‌ఐలు శివరాముడు, శ్రీశైల రెడ్డి, టైటస్, సోమశేఖర్ నాయక్, ఆర్ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీస్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, విధి నిర్వహణలో మరణించిన సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు ఎస్‌పి ప్రకాష్ బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి

అనుబంధ కమిటీలతో కీలకపాత్ర పోషించాలి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

నూతన అనుబంధ కమిటీలతో మునిసిపాలిటీలో కీలకపాత్ర పోషించాలని ఎమ్మెల్సీ పి.రామసుబ్బారెడ్డి సూచించారు. వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ పరిధిలో వార్డు (పట్టణ) పార్టీ, అనుబంధ విభాగాల కమిటీల నియామకాలను చేపట్టారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డు, గ్రామస్థాయి నుండి కమిటీలు ఉండడం వల్ల పార్టీకి బలం చేకూరుతుందన్నారు. ప్రతి ఒక్కరూ కమిటీల ఏర్పాటులో భాగస్వాములు కావాలన్నారు. అనంతరం గిరిధర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు పోరెడ్డి మహేశ్వర రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు గజ్జల లక్షుమయ్య, గౌతమబోయిన గురుమూర్తి యాదవ్, కౌన్సిలర్, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ జానీ, కౌన్సిలర్ పోచిరెడ్డి పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం వి.నిర్మల

రాష్ట్ర స్థాయికి గురుకుల పాఠశాల విద్యార్థులు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలం వనిపెంట మహాత్మ జ్యోతి బాపూలే వెనక బడిన తరగతుల బాలికల సంక్షేమ పాఠశాల విద్యార్థులు వాలీబాల్ జిల్లా స్థాయిలో తమ ప్రతిభను కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు వి.నిర్మల తెలిపారు. అన్నమయ్య జిల్లాలోని చిన్నమండెం ప్రాంతంలో జరిగిన ఎస్జీఎఫ్ అండర్-19లో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థులు కె.చిట్టి, శ్రావ్య, గాయత్రి, చరిత ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారన్నారు. కడపలో చెస్ పోటీలలో ఎం.పల్లవి జిల్లా స్థాయిలో తమ ప్రతిభను కనబరిచి మొదటి స్థానం సాధించి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా పిఈటి శైలజ, విద్యార్థులను వి.నిర్మల అభినందించారు.



ఎన్ఎస్ఎస్ వాలంటీర్లకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కో-ఆర్డినేటర్లు

విద్యార్థుల్లో సేవాస్ఫూర్తి పెంపొందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - చాపాడు

విద్యార్థుల్లో సేవాస్ఫూర్తి పెంపొందించడమే ఎన్ఎస్ఎస్ లక్ష్యమని మైదుకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ సుభాన్ సాహెబ్ తెలిపారు. ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఇందిరమ్మ కాలనీలో 7 రోజులపాటు నిర్వహించిన ప్రత్యేక శిబిరం ఆదివారం ముగిసింది. వాలంటీర్లు కాలనీలో ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓటు హక్కు ప్రాముఖ్యత, ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం కళాశాలలో జరిగిన ముగింపు సమావేశానికి యోగి వేమన విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఎన్.వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ శిబిరంలో నేర్చుకున్న అంశాలను నిత్యజీవితంలో అమలు చేసి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. విద్యార్థి దశలో సేవా గుణాన్ని అలవర్చుకుంటే క్రమశిక్షణ గల ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. సమాజ నిర్మాణంలో ఎన్ఎస్ఎస్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు సుబ్బరాయుడు, ఎన్ఎస్ఎస్ కళాశాల కో-ఆర్డినేటర్ డాక్టర్ పివి కృష్ణారెడ్డి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సౌభాగ్యలక్ష్మి, సుమలత, నవీన్, విద్యార్థులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు పిహెచ్‌డి పట్టా

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



బాలచంద్రారెడ్డి

జేఎన్‌టీయూ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కాకర్ల బాలచంద్రారెడ్డికి పిహెచ్‌డి పట్టాను ప్రదానం చేశారు. ఆయన చెన్న య్‌లోని వెల్స్ యూనివర్సిటీలో నాలుగేళ్లుగా పిహెచ్‌డి చేస్తున్నారు. క్లౌడ్ సెక్యూ రిటీపై పరిశోధనలకుగానూ ఈనెల 14న పట్టా ఇచ్చారని గ్రహీత బాలచంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను కళాశాల ప్రిన్సిపల్, ప్రొఫెసర్లు, అధ్యాపకులు అభినందించారు.

బాలశివ డిగ్రీ కళాశాలలో ఎన్‌సిసి యూనిట్

ప్రజాశక్తి - మైదుకూరు రూరల్

మైదుకూరులోని శ్రీబాలశివ డిగ్రీ కళాశాలలో నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) యూనిట్‌ను ఆదివారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌సిసి సిటిఒ (కేర్ టేకర్ ఆఫీసర్) భూమిరెడ్డి రవికల్యాణ్ మాట్లాడుతూ ఎన్‌సిసిలో చేరి ఉన్నత భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఎన్‌సిసి అనేది కేవలం శిక్షణ మాత్రమే కాదని, అది సేవా మార్గం, వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఉక్కు సంకల్పం, నైతిక విలువలు నేటి తరానికి ఆభరణాలు అని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్‌బి సురేష్‌బాబు మాట్లాడుతూ యువతరం రేపటి భవితవ్యానికి పునాది అన్నారు. విద్యార్థులు దేశ రక్షణలో భాగస్వామ్యం కావాలని ఆకాంక్షించారు. ఎన్‌సిసి యూనిట్ ఏర్పాటుతో విద్యార్థులకు క్రమశిక్షణ, నాయకత్వం, దేశభక్తిని పెంపొందించే గొప్ప అవకాశం లభించిందన్నారు. కళాశాల కరస్పాండెంట్ శ్రీబాల శివ యోగేంద్ర మహారాజ్ స్వామీజీ, ప్రిన్సిపల్ ఎస్‌బి సురేష్ బాబు, ఎన్‌సిసి సిటిఓ భూమిరెడ్డి రవి కల్యాణ్ ఆధ్వర్యంలో 30 ఆంధ్ర బెటాలియన్ ఎన్‌సిసి కడప ఆర్మీ సోల్జర్స్ బృందానికి స్వాగతం పలికారు. కళాశాలలో జరిగిన ఈ ప్రారంభోత్సవంలో డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులకు రన్నింగ్, హైట్ వంటి శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించి ఎన్‌సిసిలోకి ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.



శ్రీబాలశివ డిగ్రీ కళాశాలలో ప్రారంభించిన ఎన్‌సిసి యూనిట్

వైద్యుల సమ్మెతో ఎంఎల్‌హెచ్‌పిలే దిక్కు

సమ్మెపై స్పందించని ప్రభుత్వం - గడువు ముగియడంతో రాని ప్రత్యామ్నాయ డాక్టర్ - ఇబ్బందులు పడుతున్న రోగులు



రోగులను పరీక్షిస్తున్న ఎంఎల్‌హెచ్‌పిలు

ప్రజాశక్తి - చాపాడు

రెండు వారాలుగా పిహెచ్‌సి వైద్యులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం స్పందించడంలేదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వాసుపత్రులకు వచ్చే రోగులకు అక్కడున్న ఎంఎల్‌హెచ్‌పిలు చికిత్స చేయాల్సి వస్తోంది. పలు ఆరోగ్య సమస్యలతో వైద్యం కోసం వచ్చిన రోగులు డాక్టర్లు అందుబాటులో లేరని తెలుసుకొని.. చేసేది లేక అందుబాటులో ఉన్న సిబ్బంది ఇచ్చిన మాత్రలు తీసుకొని, స్టాఫ్ నర్సులు వేసే టీకాలు వేయించుకొని వెళుతున్నారు. చాపాడు పిహెచ్‌సికి ప్రతిరోజూ 100కు పైగా ఒపి వస్తుంటారు. వైద్యుల సమ్మె కాలంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో రోగుల సంఖ్య క్రమేపి తగ్గుతూ వస్తోంది. అందుబాటులో ఉన్న స్టాఫ్‌నర్స్, సిబ్బంది కూడా తమ విధులు పూర్తిస్థాయిలో నిర్వహించకపోవడంతో అక్కడ ఉన్న అటెండర్ రోగులకు కట్లు కడుతున్నాడు. చాపాడులో అందుబాటులో ఉన్న ఆర్ఎంపి వైద్యుల వద్దకు రోగులు క్యూ కడుతున్నారు. ప్రభుత్వం వైద్యుల సమస్యలను పరిష్కరించడంలో అలసత్వం వహిస్తోంది. ప్రత్యామ్నాయం కూడా అందుబాటులో లేదు. వైద్యులు సమ్మె బాట పట్టగానే రిమ్స్ నుండి ఒక వైద్యున్ని బాధ్యుడిగా ప్రభుత్వం నియమించింది. ఆ వైద్యునికి గురువారం వరకు మాత్రమే అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది. తనకు నిర్ణయించిన విధుల సమయం ముగియడంతో ఆయన శుక్రవారం నుంచి విధులకు హాజరు కాలేదు. రోగులకు పరీక్షించేందుకు ఇద్దరు ఎంఎల్ హెచ్‌పిలను అందుబాటులో ఉంచారు. వారు వారికి తెలిసిన వైద్యాన్ని అందిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రోగులకు ఇబ్బందులు జరగకుండా పూర్తిస్థాయిలో నాణ్యమైన వైద్యం అందేలా ప్రత్యామ్నాయం చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వైద్యులు అందుబాటులో లేరు

కాలు దెబ్బ తినడంతో పది రోజులుగా వైద్యశాలకు చికిత్స కోసం వస్తున్నాను. గతంలో ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండేవారు. ప్రస్తుతం ఒక వైద్యుడు అప్పుడప్పుడూ ఉండేవారు. ప్రస్తుతం అటెండర్‌తో కట్టు కట్టించుకున్నాను. వైద్యులు అందుబాటులో ఉంటే ఉపయోగకరంగా ఉంటుంది.

- సూర్యనారాయణ, అల్లాడుపల్లె

సరైన వైద్యం అందడం లేదు

వైద్యులు అందుబాటులో లేకపోవడంతో పిహెచ్‌సిలో ఉన్న సిబ్బందితో చికిత్స చేయించుకుని సర్దుకుంటున్నాం. పూర్తిస్థాయిలో వైద్యం అందడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి వైద్యులను త్వరగా నియమించాలి. ప్రయివేట్ వైద్యశాలలకు వెళ్లే ఆర్థిక స్థోమత లేక పిహెచ్‌సికి వస్తున్నాం. ఇక్కడ కూడా వైద్యం అందకపోతే మా పరిస్థితి ఏంటి.

- సుబ్బమ్మ, చియ్యపాడు

రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

వైద్యం కోసం పిహెచ్‌సికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా చర్యలు చేపడుతున్నాం. రిమ్స్ నుండి గురువారం వరకు వైద్యుడు వచ్చి అందుబాటులో ఉండి రోగులను పరీక్షించేవారు. ప్రస్తుతం ఎంఎల్‌హెచ్‌పిల ద్వారా వైద్యం అందిస్తున్నాం. వైద్యులు సమ్మె బాట పట్టినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రోగులకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా వైద్య సేవలు కొనసాగిస్తున్నాం.

- బాబుల్ రెడ్డి, సూపర్‌వైజర్, చాపాడు పిహెచ్‌సి



కాలికి కట్టు కడుతున్న అటెండర్

ఉద్యోగుల పట్ల ప్రభుత్వం సానుకూలం : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

ఉద్యోగుల శ్రేయస్సు పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, చర్చల ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాం గోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానికంగా ఆదివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పెం డింగ్‌లో ఉన్న నాలుగు డిఎలతో ప్రస్తుతం ఒక డిఎను ఉద్యోగులకు ఇవ్వ డా నికి ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఉద్యోగులకు గత ప్రభుత్వంలో రూ.35 వేల కోట్ల బకాయిలు చెల్లించలేదన్నారు. పోలీసులకు సరెండర్ లీవులు, ఆర్టీసి ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చేందుకు ప్రభుత్వం అంగీక రించిందన్నారు. పిఆర్సిపి కూడా ఉద్యోగుల అనుకున్న మేరకు ప్రకటించనున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వంలో ఉద్యోగులతో చర్చలు జరిగిన దాఖలాల్లేవన్నారు. ఆర్థిక భారం ఉన్నా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం సుముఖంగా ఉందన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16,350 మందికి ఉద్యోగాలు పారదర్శకంగా నియమించామన్నారు. 2004 తర్వాత ఉద్యోగులకు ఓల్డ్ పెన్షన్ విధానం చెల్లించడానికి సానుకూలంగా ఉంద న్నారు. ఉద్యోగులకు హెల్త్ స్కీం సమస్యలు త్వరలో పరిష్కారం అవుతాయన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులతో ప్రభుత్వం చర్చలు జరుపుతూనే ఉందన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులపై పెట్టిన 160 కేసులను ఎత్తే శారని, మిగిలిన 120 కేసులు కూడా త్వరలో ఎత్తివేస్తామన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పరిగణలోనికి తీసుకొని సానుకూలంగా ఉద్యోగులు ప్రభు త్వానికి సహకరించాలన్నారు. స్వేచ్ఛ వాతావరణంలో సమస్యలను చెప్పుకోవ డానికి హక్కును కల్పించిన ఘనత బాబుది అన్నారు. కొంతమంది ఉద్యో గులు ప్రభుత్వంపై బురద జల్లడానికి అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమ ర్శించారు. ఇప్పటికైనా మానుకోకపోతే చర్యలు తప్పవ న్నారు. కిందిస్థాయి ఉద్యోగులకు స్థాయిని పెంచడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఉద్యో గుల కోసం ముఖ్యమంత్రి చేస్తున్న మేలుకు ఎమ్మెల్సీ ధన్యవాదాలు తెలిపారు.

అధికారుల తీరు.. ఎమ్మెల్యేకు పట్టదా..!

ప్రజాశక్తి - ఖాజీపేట

వివిధ ప్రభుత్వ శాఖల అధికారుల తీరుపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్వ గ్రామ సచివాలయ వ్యవస్థ, రెవెన్యూ, విద్యుత్, పౌరసరఫరాల, వ్యవసాయ శాఖల అధికారులపై ప్రజలు తీవ్రంగా ఆరోపణలు చేస్తున్నారు. ప్రజలకు మెరుగైన నాణ్యమైన సేవలు అందించాల్సిన ప్రభుత్వాధికారులు ప్రజల పట్ల చులకన భావం ప్రదర్శిస్తూ, ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. మండల రెవెన్యూ కార్యాలయం అవినీతికి కేంద్ర బిందువుగా మారిందని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించుకొని దళారులను ఏర్పాటు చేసుకొని ముక్కు పిండి డబ్బులు వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు మరి విచ్చలవిడితనంతో కొనసాగుతున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. వ్యవసాయ పనుల నిమిత్తం విద్యుత్ సంబంధించి పనులు చేస్తే రైతుల వద్ద డబ్బులు భారీగా గుంజుతున్నారని రైతులు వాపోతున్నారు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో రేషన్ డీలర్లు తూకంలో కోత పెడుతున్నారని మండిపడుతున్నారు.

ఎమ్మెల్యే ఆదేశాలను లెక్క చేయని అధికారులు: మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాలను అధికారులు ఏమాత్రం లెక్క చేయడం లేదు. ప్రభుత్వ అధికారి ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదన్న ఎమ్మెల్యే.. రెవెన్యూ శాఖలో పెద్ద ఎత్తున అవినీతి జరుగుతున్నా ఆయన ఎందుకు చర్యలు తీసుకోలేదని ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ అధికారుల అవినీతి బాగోతం గురించి పత్రికల్లో వచ్చినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అధికారులను వెనకేసుకురావడమే కదా అని అంటున్నారు. ప్రజా ప్రతినిధులంటే అధికారులకు లెక్కలేనితనంగా ఉందని మండల ప్రజలు పేర్కొంటున్నారు.

రూ.8 కోట్లతో మున్సిపాలిటీ అభివృద్ధి : ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే 'పుట్టా'


ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మున్సిపాలిటీలో రూ.8కోట్లతో వంద పనులు చేపట్టేందుకు టెండర్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. ఆదివారం మున్సిపాలిటీలో సిమెంట్ రోడ్లు, పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైదుకూరు అభివృద్ధికి ముఖ్యమంత్రి రూ.220 కోట్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ప్రతి ఇంటికి తాగునీరు అందించేందుకు రూ.99 కోట్లు, రోడ్లు, డ్రెయినేజీలకు రూ.120 కోట్లు మంజూరు చేస్తామన్నారు. ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే స్థానిక, మండల నాయకులకు తెలపాలన్నారు. అవసరమైతే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రజా సమస్యలు పరిష్క రించేందుకు ముందుంటామన్నారు. మాజీ ఎమ్మెల్యే ఎస్.రఘు రామిరెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ అభివృద్ధి ఎక్కడ చేయాలో సలహాలివ్వాలన్నారు. 2019లో గురుకుల పాఠశాల మంజూరు చేయిస్తే దాన్ని ఎందుకు ప్రారంభించలేదన్నారు. మీ ప్రభుత్వంలో లాగా నాసిరకం పనులు చేయబోమన్నారు. ప్రజలకు సేవ చేయాలని వచ్చాను.. మీలాగా దోచుకునే అలవాటు తనకు లేదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేస్తే రాబోయే ఎన్నికల్లో మళ్లీ గెలిపిస్తారని తెలిపారు. లేదంటే పక్కన పెడతారని అన్నారు. తెలుగుదేశం వీరాభిమాని బండి రవికుమార్‌ను ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. రవికుమార్‌కు పెన్షన్ అందించేందుకు జిల్లా ఉన్నతా ధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ దాసరి బాబు, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాల చిన్న, రాష్ట్ర రైతు సంఘం నాయకుడు ధనపాల జగన్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎన్ శ్రీనివాసులు, యూనిట్ ఇన్‌ఛార్జి బండి అమర్నాథ్, వైవి సుబ్బారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

దువ్వూరులో బస్టాండ్ ప్రారంభం

దువ్వూరు : ఎన్నో ఏళ్లుగా దువ్వూరు వాసుల ఎదురుచూసిన బస్టాండ్ కల నేటితో నెరవేరింది. ఆదివారం ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బస్టాండ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా బస్టాండ్‌లేక ప్రయాణికులు, ప్రజలు ఇబ్బందిపడుతున్న విషయాన్ని ప్రజలు తన దృష్టికి తెచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. ఆ మేరకు పనులు త్వరగా పూర్తి చేయాలని టిడిపి నాయకుకు చెప్పానని పేర్కొన్నారు. అన్ని సౌకర్యాలతో నెలలోపు పూర్తి చేశారన్నారు. మండల ప్రజలకు అసౌకర్యం కలుగకుండా చూస్తామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు రమణారెడ్డి, పట్టణ అధ్యక్షులు రాంబాబు, నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు.

అవినీతికి తావు లేదు : ఎమ్మెల్యే 'పుట్టా'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు రూరల్ : తన నియోజకవర్గంలో అవినీతికి తావులేదని, ఏ మాత్రం సహించేది లేదని మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ స్పష్టం చేశారు. మైదుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పనుల కోసం ప్రజలు ఎవరూ డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. అధికారులు ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా, అవినీతికి పాల్పడినా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వ హ యాంలో పైపులను రైతుల గోడౌన్లలో ఉంచడం వల్ల అవి పాడైపోయాయని ఎమ్మెల్యే తెలిపారు. మైదుకూరు మున్సిపాలిటీ పరి ధి కాలువలపై ఉన్న ఆక్రమణలను తొలగించేందుకు ప్రణాళికాబద్ధంగా, చట్టపరంగా ముందుకు వెళ్లాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

జోరుగా అనధికారికంగా టపాసుల విక్రయాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

ఖాజీపేట పట్టణంలో అనధికార టపాసుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు పొందకుండా దీపావళి పండుగను ఆసరాగా చేసుకుని టపాసులు విక్రయాలు గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నారు. ఆయా చిల్లర దుకాణాల్లో అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. పెద్ద ఎత్తున బాణసంచా నిలువ చేసి ఆఫర్ల పేరు తో అమ్మకాలు సాగిస్తున్నారు. జడ్పీ పాఠశాల సమీప ప్రాంతాల్లో ఈ అమ్మ కాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. గత ఏడాదికి సంబంధించి సరుకు నిలువ చేసి ఇలా అమ్మకాలు సాగిస్తున్నారని ప్రజలు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. రెవెన్యూ, ఫైర్ సిబ్బంది, పోలీస్ శాఖల నుంచి అనుమతి పొందామని, తమకు ఇష్టం వచ్చిన ధరకు అమ్ముతామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నారని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. అమ్మకాల ప్రాంతంలో ఎలాంటి భద్రతా చర్యలు కానరాలేదని, అధికారులు ఎలా అనుమతులు మంజూరు చేశారంటూ ప్రజలు అధికారుల తీరుపై ఆగ్రహం చెందుతున్నారు.



మాట్లాడుతున్న సత్యనారాయణ

ఆరోగ్యశ్రీ పట్టని కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ఆరోగ్యశ్రీ వైద్య సేవలు నిలిచిపోవడంతో పేద, మధ్యతరగతి ప్రజలు అల్లాడిపోతున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోవడంలేదని సిపిఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి రూ.2,700కోట్లు హాస్పిటళ్లకు ఇవ్వాల్సిన బకాయిలు నిలిచిపోయాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పది రోజుల నుంచి బాధితులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. డిశ్చార్జ్ అయ్యే లోపు ప్రభుత్వం నుంచి డబ్బులు రోగి పేరు మీద వస్తే డబ్బులు కట్టాల్సిన అవసరం లేదని, లేనిపక్షంలో వైద్య ఖర్చులు స్వయంగా భరించాలని ఆస్పత్రి యాజమాన్యం వసూలు చేస్తున్నారన్నారు. వెంటనే ప్రభుత్వం ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలను విడుదల చేసి పేద, మధ్య తరగతి ప్రజానీకాన్ని ఆదుకోవాలని ఆయన కోరారు. కొందరు ఆరోగ్యశ్రీ హాస్పిటల్‌లో కూడా ప్రభుత్వం ఇచ్చేది తీసుకొని మరీ రోగుల వద్ద అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారన్నారు. ఇలాంటి ఆసుపత్రులపై ప్రభుత్వం దృష్టి పెట్టి వాటిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. విలేకరుల సమావేశంలో సుందరయ్య నగర్ ఏరియా కార్యదర్శి శేఖర్, డివైఎఫ్ఐ కార్యదర్శి విశ్వనాథ్, హరి పాల్గొన్నారు.

19 మంది మందుబాబులు అరెస్టు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు రూరల్ పోలీసులు డ్రోన్ సాంకేతికతను ఉపయోగించి బహిరంగంగా మద్యం సేవిస్తున్న 19మందిని అరెస్టు చేశారు. ఎస్పి నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు ప్రొద్దుటూరు డిఎస్పి పూతి భావన నేతృత్వంలో ఆదివారం అరెస్టు చేశార. రూరల్ సిఐ ఎం.నాగభూషన్ డ్రోన్ ఏరియల్ సర్వే ద్వారా ప్రొద్దుటూరు, దాని చుట్టు పక్కల ప్రాంతాల్లో.. ముఖ్యంగా రింగ్ రోడ్డు పరిసర ప్రాంతాల్లో, దొరసాని పల్లి, రెండు కొళాయిలు, ఖాళీ రియల్ వెంచర్లలో గాలించారు. బహిరంగంగా మద్యం సేవిస్తున్న సమూహాలను గుర్తించారు. ఆ ప్రాంతాల్లో మద్యం సేవిస్తూ అల్లరి చేస్తున్న 19 మందిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి భావన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం ప్రజా శాంతి భద్రతకు భంగం కలిగించే అనుచిత చర్య అన్నారు. మద్యం సేవించిన వ్యక్తులు మైకంలో గొడవలకు పాల్పడే అవకాశం ఉందన్నారు. ప్రజా శాంతి భద్రత పరిరక్షణ దృష్ట్యా ఇకపై బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి అసాంఘిక చర్యలకు పాల్పడే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రోన్ ఆపరేషన్‌లో ప్రొద్దుటూరు రూరల్ ఎస్ఐలు అరుణ్ రెడ్డి, కెసిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలతో నిండి ఉన్న మల్లేపల్లె రైతు సేవ కేంద్రం

రైతు సేవా కేంద్రం.. పరిసరాలు అధ్వానం

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రభుత్వ కార్యాలయాలు ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సి ఉండగా.. అపరిశుభ్రతకు నిలయాలుగా మారుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిసరాల శుభ్రత కోసం స్వచ్ఛభారత్, స్వచ్ఛ ఆంధ్ర వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నా ఆదర్శంగా నిలవాల్సిన అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. వివరాల్లోకెళ్తే.. మండల పరిధిలోని మల్లాయపల్లె రైతు సేవ కేంద్రం అపరిశుభ్రంగా మారుతోంది. కార్యాలయ భవనం చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు దర్శనమిస్తున్నాయి. కార్యాలయానికి వచ్చే ప్రజలు తీవ్ర సౌకర్యానికి, ఇబ్బందులకు గురవుతున్నారు. పరిసరాల శుభ్రతకు పాటుపడాల్సిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పరిసరాలు అధ్వానంగా ఉండటంతో విష సర్పాలు సంచ రిస్తున్నాయని వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి పరిసరాలను శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నిర్మాణంలో ఉన్న మరుగుదొడ్డి

స్వచ్ఛభారత్ నిధులతో మరుగుదొడ్డి

ప్రజాశక్తి - చాపాడు

చాపాడు స్త్రీ శక్తి భవన్‌పై రూ.మూడు లక్షల స్వచ్ఛభారత్ నిధులతో మరుగుదొడ్డి నిర్మాణాన్ని చేపడుతున్నారు. స్త్రీశక్తి భవన్‌కు అనుసంధానంగా ఉపాధి, వెలుగు కార్యాల యాలున్నాయి. నిత్యం వివిధ సమావేశాలు ఈ భవనంలో అధికారులు నిర్వహిస్తుంటారు. ము ఖ్యంగా డ్వాక్రా మహిళలు సమావేశాలకు హాజరైనప్పుడు మరుగు దొడ్డి సమస్య తలెత్తు తుంది. ఇందుకు ప్రభు త్వం స్పందించి మరుగు దొడ్డి, ట్యాంక్, నీటి వసతి, పైప్‌లైన్ ఏర్పాటు చేపట్టారు. ప్రస్తుతం మరుగుదొడ్డి నిర్మాణాన్ని ప్రారంభించారు.